అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. బుధవారం రెవెన్యూ, మున్సిపల్ పంచాయతీ రాజ్ అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా ఆస్కారంగా వరద వచ్చే అవకాశం ఉన్న వాగులు, కాలువల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నారాయణఖేడ్, జహీరాబాద్, ఝరాసంగం, రాయికోడ్ ప్రాంతాల్లో వాగులు పొంగి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా మండలాల తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఏర్పాట్లు: ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, రవాణా శాఖల అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లాలో 37342.50 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు తూర్పారబట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

మునిపల్లి, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం మునిపల్లి తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆదర్శ పాఠశాల, బుధేరా సామాజిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు.

పర్యవేక్షణ పటిష్ఠం

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ



జిల్లాలో 27 మండలాలు ఉండగా.. 12 మంది మండల విద్యాధికారులు మాత్రమే పని చేసేవారు. వీరిలో ఎవరైనా ఉద్యోగ విరమణ చేస్తే పక్క మండల ఎంఈవోకు అదనపు బాధ్యతలు కేటాయించేవారు. ఒక్కో ఎంఈవో మూడు, నాలుగు మండలాల పాఠశాలలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉండేది. ఏళ్లుగా ఇదే తీరు. వీరు ఏ మండలంలోనూ పూర్తిస్థాయిలో పనిచేయలేక ఇబ్బంది పడే వారు. ఈ సమస్యను గుర్తించిన విద్యాశాఖ.. నోడల్ అధికారులుగా పని చేస్తున్న వారిని మండల విద్యాధికారులు(ఎంఈవో)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని అన్ని మండలాలకు ఎంఈవోలు పూర్తిస్థాయి సేవలందించనున్నారు.

ప్రభుత్వ బడుల్లో ఇలా..

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	864	52,129
ప్రాథమికోన్నత	189	24,152
ఉన్నత	203	65,120



సదాశివపేట ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో శంకర్

ఇప్పటి వరకు పరిస్థితి..

రాయికోడ్ మండల విద్యాధికారి ఎన్.శ్రీనివాస్ ఝరాసంగం, మనూరు, నాగల్‌గిద్దలకు అదనపు బాధ్యతలు నిర్వర్తించేవారు. శంకర్ కల్హేర్ మండలంతో పాటు కంగ్టి సిర్గాపూర్, పుల్కల్, చౌటకూర మండలాలకు అదనపు ఎంఈవోగా పాఠశాలలను పర్యవేక్షించేవారు. సంగారెడ్డి మండల విద్యాధికారి వెంకట నర్సింహులు కంది, హత్నూర మండలాల బాధ్యతలు అప్పగించారు. [illegible]కుమారి రామ చంద్రాపురంతో పాటు జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోనూ విధులు నిర్వహించేవారు.

సీనియర్ ప్రధానోపాధ్యాయులతో భర్తీ

ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి పోస్టులను ఆయా మండలాల్లోని నోడల్ అధికారులు, సీనియర్ ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేశారు. అన్ని మండలాలకు ఎంఈవోలను కేటాయించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పనున్నాయి. విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా పర్యవేక్షించనున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి



అన్ని మండలాలకు ఎంఈవో(ఎఫ్ఏసీ)ను నియమించాం. గతంలో మూడు, నాలుగు మండలాలకు ఒకరే ఉండటంతో ఇబ్బంది పడేవారు. ఎంఈవోలు పాఠశాలలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చూడాల్సిన బాధ్యత ఎంఈవోలపైనే ఉంది. –వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

రోజుకు రెండు పాఠశాలల్లో తనిఖీలు

మండలంలోని ఉపాధ్యాయుల వేతనాలు రికార్డులను ఎంఈవోలు సిద్ధం చేస్తారు. ప్రతి పాఠశాలను సందర్శించి తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీస్తారు. ఉపాధ్యాయులకు వివిధ శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి. సమ దుస్తులు, పుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలు సమీక్షిస్తారు. మండల విద్యాధికారులు రోజుకు రెండు పాఠశాలల చొప్పున నెలకు 20 చోట్ల తనిఖీలు చేపట్టాలి. నామమాత్రంగా కాకుండా.. సమగ్రంగా పరిశీలించాలి. ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థులు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకోవాలి. పిల్లలు ఎక్కడ వెనుకబడ్డారో నివేదికలు తయారు చేయించి ఉన్నతాధికారులకు పంపించాలి. మధ్యాహ్న భోజనం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలి. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా దృష్టి సారించాలి.

పత్తి రైతుకు దిగులు

వర్షాలకు దెబ్బతింటున్న చేలు



మనూరు శివారులో ఎండిపోతున్న చేను

న్యూస్‌టుడే, నారాయణఖేడ్ టౌన్: భారీ వర్షాలకు పత్తి చేలు జాలుపట్టి ఎండిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేలో కలుపు తీయకుండా, సస్య రక్షణ చర్యలు చేపట్టే వీలు లేకుండా నిత్యం వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పత్తి మొక్కలు నల్లగా మారిపోయి ఎండిపోతున్నాయి. పూత, కాయలు రాలిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3.35 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ సారి 3,35,553 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వానాకాలంలో ముందస్తు వర్షాలు కురవడంతో ఎన్నో ఆశలతో కర్షకులు పత్తి సాగు చేశారు. పెట్టుబడికి వెనకాడకుండా సస్యరక్షణ చర్యలు చేపడుతూ వస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో ఎర్రతెగులు సోకి మొక్కలు ఎర్రబారాయి. దిగుబడి కష్టంగా మారింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. 20 రోజుల కిందటి వరకు కళకళలాడిన చేలు ఇప్పుడు చాలా చోట్ల ఎండిన మొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఈ పంట తీసేసి.. మరో పంట వేసుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పత్తి పంటకు జరిగిన నష్టంపై పూర్తి విచారణ చేయాలని.. ఆర్థిక సహాయం అందేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

పోలీసు ఠాణా ఆవరణలో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ఆటో చోదకుడి మృతి



విఠల్‌గౌడ్

హత్నూర, న్యూస్‌టుడే: ఆటో చోదకుడు పోలీసు ఠాణా ఆవరణలో ఒంటిపై పెట్రోలు పోసుకొని వారం రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేయగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై బస్సుకు సైడిచ్చే క్రమంలో ఆటో, బస్సు చోదకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో బస్సు చోదకుడు అంకురిగారి నవీన్‌పై హత్నూర మండలం మల్కాపూర్‌కు చెందిన ఆటో చోదకుడు విఠల్‌గౌడ్(29) దాడికి పాల్పడ్డాడు. వీరిద్దరినీ పోలీసులు ఠాణాకు తీసుకెళ్లారు. బస్సు చోదకుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా.. ఆటో చోదకుడు ఠాణా ఆవరణలో ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన ఈ నెల 17న చోటుచేసుకోగా.. బాధితుడు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్రెంటిస్ మేళాకు 982 మంది హాజరు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు మంచి స్పందన వచ్చింది. కందిలోని ఆయుధ కర్మాగారంలో అప్రెంటిస్ అవకాశం కోసం ఎక్కువ మంది అభ్యర్థులు హాజరయ్యారు. 361 సీట్లు ఉండగా 982 మంది రావడంతో కళాశాల ఆవరణ కిక్కిరిసిపోయింది. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో పోలీసులు చేరుకొని నియంత్రించాల్సి వచ్చింది. అంచనాకు మించి అభ్యర్థులు హాజరు కావడంతో ఆయుధ కర్మాగారం అధికారులు టోకెన్లు ఇచ్చి ముఖాముఖి కోసం హాజరు కావలసిన తేదీలను తెలియజేశారు. ఆయుధ కర్మాగారంలో ముఖాముఖి నిర్వహించి ఆయా తేదీలలో అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ప్రతిభ వెలికి తీసేందుకే పరీక్ష: ఎస్పీ



రాత పరీక్షలో పోలీసులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రతిభ వెలికి తీసేందుకు పోలీస్ డ్యూటీ మీట్ చేపట్టి పరీక్ష నిర్వహించామని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి పోటీలు చేపట్టారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించాల్సిన తీరు, ఆధారాల సేకరణ తదితరాలపై పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని వచ్చే నెల 14 నుంచి నిర్వహించే రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. తనను స్పోర్ట్స్ మీట్ కోసం చార్మినార్ జోన్‌కు నోడల్ అధికారిగా, జిల్లా స్పోర్ట్స్ మీట్‌కు అదనపు ఎస్పీ సంజీవరావును ఇన్‌ఛార్జిగా నియమించారని వివరించారు.

నేడు యోగా శిక్షకులకు ముఖాముఖి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా శిక్షకుల భర్తీకి నేడు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ముఖాముఖి నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి మధుమిత తెలిపారు. మెదక్ జిల్లాలో పురుషులు-14, మహిళలు-14, సిద్దిపేట జిల్లాలో పురుషులు-16, మహిళలు-16, సంగారెడ్డి జిల్లాలో పురుషులు-14, మహిళలు-14 చొప్పున ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 88 మందిని ఎంపిక చేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10.30 గంటల లోపు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

రైతులకు కాలుష్య పరిహారం పంపిణీ

గుమ్మడిదల, న్యూస్‌టుడే: మండలంలోని బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాల పరిధిలో కాలుష్యంతో నష్టపోయిన రైతులకు పరిశ్రమలు నష్టపరిహారం అందచేశాయి. బుధవారం బొంతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ కాలుష్య నియంత్రణ విభాగం రైతు సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రెండు గ్రామాలకు చెందిన 397 మంది రైతులకు రూ.44 లక్షల నష్టపరిహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ దేవాలయాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కావలి శంకర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పనుల నిలిపివేత.. నిధుల కొరత



సంగారెడ్డిలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయం ఆవరణలో రెండేళ్ల క్రితం రూ.63 లక్షలతో వాణిజ్య దుకాణాల సముదాయానికి శంకుస్థాపన చేశారు. 12 దుకాణాలు నిర్మించాలి. శ్లాబ్ వరకు పనులు వేగంగా పూర్తి చేసినప్పటికీ.. ఆ తర్వాత బిల్లుల రాలేదని గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్‌ను అడగగా.. రూ.16.50 లక్షల పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. నిధులు రాగానే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

సూచికతోనే సరి.. మైదానమేదీ?



నారాయణఖేడ్ మండలం కొండాపూర్ పంచాయతీ పరిధిలోని శివార్ సందుతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో రెండేళ్ల కిందట.. ఈ బడిని అక్కడికి సమీపంలోని స్కూల్ తండాలో విలీనం చేశారు. అప్పటి నుంచి శివార్‌సందుతండా పాఠశాల భవనం నిరుపయోగంగానే ఉంది. భవనం చుట్టూ మైదానం లేనప్పటికీ.. అధికారులు క్రీడా ప్రాంగణంగా ఎంపిక చేసి బోర్డు పాతారు. ఎలాంటి ఆట పరికరాలు అమర్చలేదు. ఇదీ అధికారుల తీరు.. –న్యూస్‌టుడే, నారాయణఖేడ్.

విద్యతోనే భవిత

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలన్నారు. గృహహింస, బాల్యవివాహాలు, పోక్సో, వరకట్నం నిషేధం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఏడుగురికి గాయాలు



గాయపడిన ఉపాధ్యాయినులు వరలక్ష్మి, జ్యోతి రత్నకుమారి

జోగిపేట, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఆరుగురు ఉపాధ్యాయులు, కారు చోదకుడు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం అందోలు మండలం సంగుపేట శివారులోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అందోలు మండలం అక్సానిపల్లి, నేరడిగుంట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వరలక్ష్మి, పూర్ణచందర్, రాంచందర్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ, జ్యోతి రత్నకుమారిలు ప్రతీరోజు బీహెచ్ఈఎల్, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి అందోలు మండలంలోని అక్సానిపల్లికి చెందిన ప్రవీణ్ కారులో వస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం కారులో వస్తుండగా అందోలు మండలం సంగుపేట శివారులో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న అందరూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, మండల శాఖ అధ్యక్షుడు నరోత్తంలు ఆసుపత్రిలో పరామర్శించారు.

కలెక్టరేట్‌లో బోరు.. ఉబికివస్తున్న నీరు



జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని బోరు నుంచి నీరు ఉబికివస్తోంది. బుధవారం ఉదయం నుంచి కురిసిన మోస్తరు వర్షానికి ఒక్కసారిగా బోరు ఉప్పొంగింది. మోటరు లేకుండానే బోరు నుంచి బయటకు వస్తున్న నీటిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

–న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్.

కొండాపూర్‌లో 87 మి.మీ. వర్షపాతం



నారింజ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న జలాలు

సంగారెడ్డి అర్బన్, జహీరాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం మోస్తరు వాన కురిసింది. కొండాపూర్‌లో 87.0 మి.మీ., జిన్నారం- 47.3, ఝరాసంగం- 44.0, పటాన్‌చెరు మండలం పాశమైలారం-38.8, మునిపల్లి మండలం కంకోల్- 33.0, సదాశివపేట-30.0, గుమ్మడిదల- 27.0, హత్నూర- 27.0, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్- 23.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. జహీరాబాద్ నియోజకవర్గంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొత్తూర్ శివారులోని నారింజ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే స్థాయిలో దిగువకు వదులుతున్నారు. జహీరాబాద్ శివారులో విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. వర్షం కురవడం, వేలాడుతున్న తీగల వల్లే ప్రమాదం జరిగిందని బాధిత రైతు తెలిపారు.

ఆహార భద్రతపై ఆశలు

వచ్చే నెల నుంచి రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి ఆహార భద్రత కార్డును కొలమానం చేశారు. రేషన్ కార్డు లేకపోవడంతో అభివృద్ధి ఫలాలకు అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పేద వర్గాల్లో ఆశలు చిగురించాయి.

నిరీక్షణకు తెర: రేషన్ కార్డుల కోసం పేదలు ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. 2019 తర్వాత కొత్త కార్డుల జారీ ఆగిపోవడమే దీనికి కారణం. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతుండగా.. ఆహార భద్రత కార్డు లేకపోవడం వారిపై మరింత ఆర్థిక భారం మోపుతోంది. ఎట్టకేలకు కార్డుల జారీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వీరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రేషన్ కార్డులు

తెలుపు: 3,52,301

అంత్యోదయ: 26,181

అన్నపూర్ణ: 100

జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ

రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది దొడ్డు బియ్యాన్ని తినడం లేదు. పలువురు ఈ బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని అడ్డుకొని అధికారులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు జనవరి నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తే, లబ్ధిదారులు బియ్యం వినియోగించేందుకు వీలుంటుంది. తద్వారా బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది.

గడువులోపు గగనమే!

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

నర్సింగ్ కళాశాల భవనాల పనుల్లో తాత్సారం



సంగారెడ్డిలో అసంపూర్తిగా నిర్మాణం

జిల్లాకు ప్రభుత్వం వైద్య కళాశాలతోపాటు.. నర్సింగ్ కళాశాలను మంజూరు చేసింది. నర్సింగ్ కళాశాలకు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడమే కారణమని వైద్యారోగ్యశాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. వచ్చేనెలతో పనులు పూర్తి చేయాలని గతంలోనే అధికారులు గడువు నిర్దేశించారు. ఈలోపు పనులు పూర్తి కావడం గగనమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.34 కోట్లు మంజూరు

సంగారెడ్డి పట్టణం రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో పోలీసు గృహ సముదాయం ఆవరణలో నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు వసతి గృహాలూ నిర్మించాలి. ఇందుకోసం 2022, ఫిబ్రవరి 23న అప్పటి ప్రభుత్వం రూ.34 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు ఒక్క నిర్మాణమూ పూర్తి కాలేదు. ప్రస్తుతం కళాశాల భవనం స్లాబ్ వేశారు. గోడల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నారు. వసతి గృహ భవనానిదీ ఇదే తీరు. ఇప్పటి వరకు రూ.8.43 కోట్ల మేరకు పనులు మాత్రమే చేపట్టారు.

పనులు వేగవంతం చేస్తాం

నర్సింగ్ కళాశాల, వసతి గృహాల భవనాల పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. గుత్తేదారుతో సమావేశం నిర్వహిస్తాం. పనులు, బిల్లులపై చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తాం. బిల్లుల సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు రాగానే చెల్లింపులు చేసేలా ప్రయత్నిస్తాం. –రవీందర్‌రెడ్డి, ఈఈ, టీఎస్ఎంఎస్ఐడీసీ.

విద్యార్థులకు ఇబ్బందులు

నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని శిశు వికాస కేంద్రంలో తరగుతులు, వసతి సౌకర్యం కల్పించారు. అక్కడ 60 మంది ఉండగా మరో 60 మంది అద్దె భవనంలో ఉంటున్నారు. మరో రెండు నెలల్లో 60 మంది విద్యార్థినులు నర్సింగ్ శిక్షణ కోసం జిల్లాకు రానున్నారు. వీరందరికీ వసతి, తరగతుల నిర్వహణ మరింత ఇబ్బందిగా మారనుంది.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) దరఖాస్తు గడువు ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. గడువు పెంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణపతి చక్కెర కర్మాగారం ఛైర్మన్‌గా రాంరెడ్డి



సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని గణపతి చక్కెర కర్మాగారం ఛైర్మన్‌గా సదాశివపేట మండలం కంబాలపల్లికి చెందిన గడీల రాంరెడ్డిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా గణపతి పరిశ్రమ జీఎం ఆర్.కృష్ణమోహన్, కేన్ కన్సల్టెంట్ కె.వెంకట నర్సయ్యలకు చోటు కల్పించారు.

అట్టడుగు వర్గాలకు దీన్‌దయాళ్ సేవలు



దీన్‌దయాళ్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న గోదావరి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ అట్టడుగు వర్గాలకు ఎనలేని సేవ చేశారని భాజపా జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి పేర్కొన్నారు. బుధవారం భాజపా జిల్లా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. భాజపా నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి స్మార్టు కార్డు

వచ్చే నెల నుంచి సర్వే • మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా ఫ్యామిలీ స్మార్ట్ (డిజిటల్) కార్డు అందించే దిశగా వచ్చే నెల నుంచి సర్వే మొదలవనుందని, రేషన్ కార్డులు అందించేందుకు అడుగులు పడనున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖలు, సిద్దిపేట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఒకే కార్డుపై ప్రభుత్వ పథకాలు అందే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుందన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి-సంక్షేమ పథకాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పింఛను, రేషన్, హెల్త్ ప్రొఫైల్, ప్రభుత్వ పథకాలన్నింటికి ఉపయోగపడుతుందన్నారు. ఒకవేళ ఆసుపత్రికి వెళ్లినా ఆరోగ్య స్థాయి వివరాలు సులువుగా తెలుస్తాయని, చికిత్స సత్వరం అందుతుందన్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుల్లో దాదాపు ఐదు అంశాలను అమలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తామన్నారు. పర్యావరణ, ఆధ్యాతిక పర్యాటక అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని తెలిపారు. నిధుల లేమి సమస్య ఎక్కువగా ఉందని, విడుదలయిన వెంటనే పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు కలెక్టర్ పరిధిలో ఉంటే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక, జనగామ, మానకొండూరు ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ మనుచౌదరి, అధికారులు పాల్గొన్నారు.

బోధన భళా.. కొలువుల కళ



ఒకే కళాశాల నుంచి 87 మంది ఏఈఈలు



నీటిపారుదల శాఖలో ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి టౌన్, కంది:

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల.. ఎన్నో ఆశలతో ఇక్కడ చదివారు. అధ్యాపకుల బోధన.. విద్యార్థులు కష్టపడి చదివారు. వీరిలో కొందరు వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా పని చేస్తున్నా పెద్ద ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. నిరంతరం లక్ష్య సాధనకు కృషి చేశారు. కష్టపడి చదవడంతో వారికి ఇష్టమైన నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా ఉద్యోగాలు సాధించారు. రైతులకు మరింత సేవ చేసేందుకు తమకు అవకాశం దక్కిందని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఘనత.. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ పత్రాలు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం..

బ్యాంకు ఉద్యోగం మానేసి..

– శరత్‌చంద్ర



మాది మహబూబ్‌నగర్ జిల్లా. తల్లిదండ్రులు చంద్రశేఖర్- పోచమ్మ. వ్యవసాయం చేస్తూ చదివించారు. నేను ఎంబీఏ చదివి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేశా. నాన్న కోరిక మేరకు వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చేరా. ఆశించిన నీటిపారుదల శాఖలో ఏఈఈ పోస్టుకు ఎంపికయ్యాను.

నాణ్యతతో సుసాధ్యం

కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ చదివిన 87 మంది నీటి పారుదల శాఖలో ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే అత్యధిక మంది ఒకేసారి ఎంపికైన ఘనతను కళాశాల దక్కించుకుంది. గతంలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు చదువుల్లో వెనకబడ్డారు. మూడేళ్ల క్రితం వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టి అధ్యాపక పోస్టులు భర్తీ చేయించుకున్నారు. నిష్ణాతులైన అధ్యాపక బృందం.. నాణ్యమైన బోధనే విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకునేందుకు దోహద పడ్డాయి. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిరూపించారు. భవిష్యత్‌లో ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు దిక్సూచిగా నిలిచారు.

లక్ష్య సాధనకు కృషి

– మాన్యరెడ్డి



మాది మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం. తండ్రి వాసురెడ్డి, వ్యవసాయ కుటుంబం మాది. వ్యవసాయ విస్తరణ అధికారిగా పని చేస్తూనే ఇక్కడ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివా. వ్యవసాయంలో రైతులకు కొత్త పద్ధతులకు సంబంధించి సూచనలు సలహాలు ఇచ్చేదాన్ని. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికతో చదివా.

అమ్మానాన్నల ఆశయం

– భవాని



మాది సూర్యాపేట. మా తల్లిదండ్రులు గురుమూర్తి- పద్మావతి. ప్రభుత్వ ఉద్యోగం రావాలన్న అమ్మానాన్నల కోరిక. చిన్నతనం నుంచి కష్టపడి చదివించారు. వారి ఆశయ సాధనను నిరంతరం గుర్తు చేసుకునేదాన్ని. అధ్యాపకులు సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసేవారు. చదువు పూర్తి కాగానే ఏఈఈ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

ఆర్ద్రా మహోత్సవ వైభవం



కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం ఆర్ద్రా మహోత్సవం వైభవంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ, వైదికుల పర్యవేక్షణలో గణపతి పూజ, పాశుపత అభిషేకం, విశేషార్చన, హోమం, పూర్ణాహుతి జరిగాయి. భక్తులు విజయదుర్గను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

28న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఇంటర్మీడియట్) ఆధ్వర్యంలో ఈ నెల 28న మెదక్‌లోని ఇందిరా గాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అండర్-19 ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పదో తరగతి మెమో, బోనఫైడ్, జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛ ఆకృతి.. స్ఫూర్తి



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ఫుట్‌బాల్ మైదానంలో విద్యార్థినులు 'ఎస్‌హెచ్‌ఎస్' అక్షరాల ఆకృతిలో బుధవారం ప్రదర్శన చేపట్టారు. 40 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు ఉన్న ఈ మైదానంలో మొత్తం 500 మంది విద్యార్థినులు కేవలం 40 నిమిషాల్లో క్రమశిక్షణగా ప్రదర్శనలో కూర్చున్నారు. అంతకు ముందు వారు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

చారిత్రక ప్రదేశాలే సంపద

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వమే తరగని సంపద అని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగదీశ్వర్ అన్నారు. కళాశాల యువ, పర్యాటక క్లబ్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు బుధవారం నిర్వహించారని చెప్పారు. 'నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'పర్యాటక రంగ అభివృద్ధిలో యువత పాత్ర' అంశంపై ఉపన్యాసం, 'పర్యావరణహిత సుస్థిర పర్యాటక రంగం' అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు ఏర్పాటు చేశారు.

విలువ పెంచే మూలాలు

మూలాలను మరిచి పోయి ఎంతగా ఎదిగినా జీవితాన్ని మోసపుచ్చినట్టే లెక్క... ప్రముఖులు యువతకు సూచించే విషయమిది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా, ఇతర రంగాల్లో స్థిరపడినా కొందరు అంతకు ముందు తాము ఏ విధులు నిర్వర్తించే వారో మరచిపోకుండా తరచుగా వాటిని చేపడుతుంటారు. నైపుణ్యం చెక్కుచెదరకుండా చూసుకుంటారు. ఈ కోవలోనే వృత్తి, ప్రవృత్తులతో ముందడుగు వేస్తున్న కొందరి జీవన గమనంపై 'న్యూస్‌టుడే' కథనం.

వడ్రంగి.. నైపుణ్యమండీ



పరికరాలు తయారు చేస్తున్న కృష్ణ

కొడంగల్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఇందనూర్ గ్రామానికి చెందిన వడ్ల ముద్దప్ప, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వడ్ల కృష్ణ. ఎంఏ, డీఈడీ చేసి ప్రస్తుతం బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్నారు. తాత బాలప్ప, తండ్రి ముద్దప్ప వద్ద కృష్ణ వడ్రంగి పనులను చిన్నప్పుడు నేర్చుకున్నారు. నాగలి, గొర్రు, గుంటుక వంటి వ్యవసాయ పరికరాలను తయారు చేయడం, సీజన్‌లో మరమ్మతులు చేస్తున్నారు. జొన్నలు, వడ్లు, ఇతర పంటలను రైతులు కృష్ణ కుటుంబానికి అందిస్తారు.

వారసత్వ ఇస్త్రీ

తాండూరు టౌన్: వాళ్లు ముగ్గురు అన్నదమ్ములు.. ప్రభుత్వ ఉపాధ్యాయులు. కుల వృత్తి స్ఫూర్తితోనే తాము ఉపాధ్యాయులుగా ఎదిగామని నమ్మి పనిని కొనసాగిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన రమేశ్.. యాలాలలోని ప్రభుత్వ పాఠశాలలో, రాజేశ్.. హాజీపూర్‌లో, శ్రీనివాస్.. పెద్దేముల్ మండలం మంబాపూరులో ఉపాధ్యాయులుగా బోధిస్తున్నారు. సాయంత్రం పాఠశాల సమయం పూర్తి కాగానే ముగ్గురూ తమ ఇళ్ల వద్ద ఇతరుల దుస్తులను ఇస్త్రీ చేస్తున్నారు. ఎంత ఎదిగినా భేషజానికి పోకుండా వారసత్వంగా వృత్తి నైపుణ్యాలు ఉంటే జీవితం సంతృప్తిగా ఉంటుందని వారు తెలిపారు.



శ్రీనివాస్



రమేశ్



రాజేశ్

ఆదాయం మెరుగు పరిచే బజ్జీ



బజ్జీలు వేస్తున్న కృష్ణ

తాండూరు: వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రంథాలయ సహాయకుడు కృష్ణ రోజూ విధులు ముగియగానే అదనపు సంపాదనకు బజ్జీలు వేస్తూ విక్రయిస్తున్నారు. వారు ఐదుగురు కుటుంబ సభ్యులు. 2009లో పొరుగు సేవల విధానంలో ఉద్యోగంలో చేరారు. రాత్రి 7 గంటల వరకు విధుల్లో ఉంటారు. తర్వాత 12 కి.మీ. దూరంలోని తాండూరులో రాత్రి 8 గంటల నుంచి బజ్జీల విక్రయ దుకాణం తెరుస్తారు. బజ్జీల విక్రయంతో ఆదాయం చేదోడుగా ఉంటోందని తెలిపారు.

ఆధ్యాత్మికం.. పరవశం



శ్రీశైలంలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌టుడే, దోమ: 'ఏ తీరుగ నను దయ చూసెదవో ఇనవంశోత్తమ రామా..', 'శివ శివ యనరాదా మనసా..' ఇలా దేవాలయాలు, మఠాల్లో భజనలు భక్తితత్పరతతో మార్మోగుతుంటాయి. కీర్తనలను, పాటలను పాడటానికి కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా భజన మండళ్లు ఉన్నాయి. వివిధ గ్రామాల్లోని గుళ్లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. అక్కడ రాకమచర్ల కీర్తనలు, భక్త తుకారం, రామాయణం, పాండురంగడి భజనలు, తత్వాలు పాడతారు. సాధారణంగా పుణ్యదినాలు, పండుగలు, శని, ఆది, సోమవారాల్లో కార్యక్రమాలు ఉంటాయి. వికారాబాద్ జిల్లా దోమ మండల పాలేపల్లికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి భక్తులు పూర్వీకుల నుంచి ఈ ఆచారాన్ని అనుసరిస్తున్నారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మిక పాటలు, పద్యాలు, పండగలపై ప్రవచనాలను సాధన చేయిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి జిల్లాలోని తాండూరు భద్రేశ్వరస్వామి, కొడంగల్ శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు, చేవెళ్లలోని శంకరమ్మ మాత, వికారాబాద్‌లోని బుగ్గరామేశ్వరం, కుల్కచర్ల మండలం ఏకశిల పర్వత ఉత్సవాల సందర్భంగా మండలి భక్తులను ఆహ్వానిస్తారు. గత వారం శ్రీశైల దేవస్థానం నుంచి ఆహ్వానం అందుకున్నారు. అక్కడ తమ భజన సంకీర్తనల ప్రతిభను చాటుకున్నారు. గతేడాది స్వర్గీయ కొండా మాధవరెడ్డి స్మారకార్థం భజన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నారు. గ్రామంలో వీరితో పాటు సీతారామచంద్ర మహిళ భజన మండలి కూడా ఉంది.



చంద్రశేఖరాచార్యులను సన్మానిస్తున్న రేగోడ్ మఠం బాధ్యులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

రేగోడ్: హిందూ సనాతన ధర్మాన్ని, ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని కడప జిల్లా కందిమల్లయ్యపల్లిలోని వీరబ్రహ్మం సంస్కృత వేద పాఠశాల ప్రధానాచార్యుడు చంద్రశేఖరాచార్యులు అన్నారు. మెదక్ జిల్లా రేగోడ్‌లోని బ్రహ్మంగారి మఠాన్ని బుధవారం సందర్శించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఘటనలు, దాడులను తీవ్రంగా పరిగణించి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బ్రహ్మంగారి మఠం కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ప్రేమించిన అమ్మాయి దక్కదని యువకుడు..



అనిల్ కుమార్

ములుగు, న్యూస్‌టుడే: వారిద్దరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. విషయం అమ్మాయి మేనమామలకు తెలియడంతో వారు పెళ్లికి నిరాకరించారు. కోరుకున్న అమ్మాయి దక్కదని భావించిన ఆ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(19) హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతి అతడి కంటే ఏడాది పెద్దది. ఆమె అమ్మమ్మగారిల్లు కూడా పాతూరే. గతేడాది ఆమె ఇక్కడికి వచ్చినప్పుడు అనిల్ కుమార్‌తో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. పెద్దలతో మాట్లాడి పెళ్లి చేసుకుందామని ప్రేమికులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని యువకుడి తండ్రి కిష్టయ్య అమ్మాయి మేనమామల దృష్టికి తీసుకెళ్లగా వారు నిరాకరించారు. విషయం ఇంతటితో వదిలి పెట్టాలని, అమ్మాయి జోలికి మళ్లీ రాకూడదని మందలించారు. ప్రేమించిన అమ్మాయి దక్కదని తెలుసుకున్న అనిల్ కుమార్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తన కొడుకు మృతికి అమ్మాయి మేనమామలు కారణమంటూ అనిల్ కుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మద్యానికి బానిసై డ్రైవర్..



పరశురాములు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పరశురాములు(40) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. పరశురాములు వృత్తిరీత్యా డ్రైవర్. ఏడాదిగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. 20 రోజుల క్రితం మద్యం తాగి ఇంటికొచ్చి భార్య వాణితో వాగ్వాదానికి దిగడంతో ఆమె తన పుట్టింటికి(జప్తినాచారం) వెళ్లారు. మనస్తాపానికి గురై బుధవారం తన వ్యవసాయ బావి వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో కార్మికుడు..



నాగరాజు

దుబ్బాక, న్యూస్‌టుడే: ఒంటికి నిప్పంటించుకుని దుబ్బాక పట్టణానికి చెందిన బెల్లె నాగరాజు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగరాజు వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకున్నాడు. మంటలకు తాళలేక కేకలు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. 108 వాహనంలో సిద్దిపేటకు, అక్కడ్నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఘటనపై దుబ్బాక ఎస్సై గంగరాజును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్ మహేశ్వరి (50) ప్రధాన రహదారి బుధవారం డివైడర్ దాటుతుండగా వేములవాడ కమాన్ వైపు ఓ యుకువడు ద్విచక్రవాహనంపై వస్తూ ఆమెను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్వరి మృతిచెందింది. కుమారుడు భానుప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

పిడుగుపాటుతో ఒకరి మృతి



జాటి పటేల్

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారానికి చెందిన కుమ్మరి అశోక్ వద్ద ఒడిశా రాష్ట్రం నవాపాడ జిల్లా గోడల్ గ్రామానికి చెందిన జాటి పటేల్(36) మూడు నెలలుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 24వ తేదీన ఆయన గేదెలు మేపడానికి పొలానికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. రాత్రయినా జాటి పటేల్ ఇంటికి రాకపోవడంతో యజమాని అశోక్ చరవాణిని సంప్రదించగా ఎత్తలేదు. గేదెలు మాత్రం ఇంటికి వచ్చాయి. పొలం వద్దకు వెళ్లి వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం మళ్లీ వెళ్లి చూడగా డంప్‌యార్డు వద్ద విగత జీవిగా పడి ఉన్నాడు. పిడుగుపాటుతో మృతిచెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరీక్షణకు తెర

గిరిజన గురుకుల డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్:

గిరిజనులను పేదరికం నుంచి గట్టెక్కించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సొంత భవనం లేకపోవడంతో రెండేళ్ల క్రితం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల శివారులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. రెండు సంవత్సరాలుగా ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా ప్రభుత్వం ప్రవేశాలకు అనుమతించిన నేపథ్యంలో కథనం. రెండు సంవత్సరాలుగా ప్రవేశాలు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ఉంటాయో లేవో తెలియని పరిస్థితి. చాలామంది విద్యార్థులు ఇతర కళాశాలలో ఇప్పటికే చేరారు. ప్రవేశాలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గిరిజన విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈనెల 27 లోగా ప్రవేశాలు పొందాలని సూచించడమే దీనికి కారణం. దరఖాస్తులకు మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. గడువు తేదీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కాలేజీలోని నాలుగు కోర్సుల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి.



సద్వినియోగం చేసుకోవాలి

– మహేశ్వరి, ప్రిన్సిపల్

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గిరిజన గురుకులంలో డిగ్రీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వివరాలకు 96422 86686, 97059 92496, 80080 70959 ఫోన్లలో సంప్రదించాలి.

కోర్సులు: • బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) • బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) • బీకాం (సీఏ) • బీకాం (ఆనర్)

ప్రత్యేకతలు:

- గిరిజనులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక గురుకుల డిగ్రీ కళాశాల ఇది
- ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్ ఉన్నాయి. • క్రీడల్లో ప్రోత్సాహం
- వైఫై సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్ • డిజిటల్ గ్రంథాలయం • ఉచిత వసతి, నాణ్యమైన భోజనం

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు!

వాహనంతో ప్రవాహం దాటుతుండగా ప్రమాదం



వాగులో కొట్టుకుపోతున్న ఇస్మాయిల్, (వృత్తంలో) షాకీర్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంతో వాగు దాటుతూ వరద ఉద్ధృతికి వ్యక్తి గల్లంతవగా మరొకరు నీటిలో కొట్టుకుపోతూ చెట్ల కొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి బూచినెల్లి వద్ద నారింజ వాగు పొంగింది. కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారులోని మైలూరుకు చెందిన షాకీర్(40) ద్విచక్ర వాహనంపై ఆయన ఇంటి పక్కన ఉండే ఇస్మాయిల్(60)తో కలిసి జహీరాబాద్ వైపు వస్తున్నారు.

ఇస్మాయిల్‌ను రక్షించిన గ్రామస్థులు

బూచినెల్లి సమీపంలోకి రాగానే నారింజ వాగు వంతెన మీదుగా పారుతున్న వరద ఉద్ధృతిని అంచనా వేయకుండా వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. మధ్యలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో షాకీర్ నీటిలో కొట్టుకుపోగా... ఇస్మాయిల్ పక్కనే చెట్లకొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. వాగులో చెట్లకొమ్మలు పట్టుకుని నీళ్లలో ఉన్న ఇస్మాయిల్‌ను గ్రామస్థులు గుర్తించి రక్షించారు. వ్యక్తి గల్లంతు విషయం తెలుసుకున్న జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్ఐ రుక్మొద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘనపూర్-జహీరాబాద్ మార్గంలో రాకపోకలు నిషేధించారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠా పట్టివేత



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కుల్కచర్ల: కల్తీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని 9 క్వింటాళ్ల 38 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్, 2 క్వింటాళ్ల వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో శశిధర్ కిరాణ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ నకిలీ అల్లం, వెల్లుల్లి డబ్బాలు లభించాయి. శశిధర్‌ను విచారించగా.. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలకృష్ణ, వెంకటేశ్వర్లు నుంచి కొన్నట్లు తెలిపారు. వారికి కీసర మండల కేంద్రానికి చెందిన దామోదర్‌రెడ్డి సరఫరా చేసినట్లు తేలింది. దామోదర్‌రెడ్డి హైదరాబాదులో ముకుంద జింజర్, గార్లిక్ పేస్ట్ ఇండస్ట్రీని నడుపుతున్నాడు. అందులోనే సిట్రిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, టెస్టింగ్ సాల్ట్‌లతోపాటు కుళ్లిపోయిన వెల్లుల్లి లభించాయి. నిందితులపై కేసు నమోదైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

మంత్రి దృష్టికి పోచమ్మబస్తీ సమస్య

ఐడీఏ బొల్లారం (జిన్నారం): ఐడీఏ బొల్లారం పట్టణంలోని పోచమ్మబస్తీలో రోడ్డు నిర్మాణం చేయటం లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహకు బుధవారం పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు వివరించారు. అన్ని రోడ్లు వేసినా... తమ దారిని పట్టించు కోవటం లేదన్నారు.



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

పుట్టిన రోజు వేడుకకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్న విద్యార్థినిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం పాలైన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది ఎస్సై అభిమాన్‌సింగ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం పన్యాల గ్రామానికి చెందిన నాగలక్ష్మి(18) ఇంటర్ పూర్తి చేసింది. స్నేహితురాలు పుట్టిన రోజు వేడుకకు పిలిస్తే తన సోదరుడు నాగరాజుతో కలిసి కూకట్‌పల్లికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఇద్దరూ రహదారిపై పడిపోవడంతో నాగలక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందింది. సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతోనే తన సోదరి ప్రాణాలు కోల్పోయిందని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు.



నాగలక్ష్మి

ప్రజారోగ్యం... పట్టింపు శూన్యం!

పట్టణాల్లో ఇష్టారీతిన మాంసం విక్రయాలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ, సదాశివపేట, జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్

మాంసం విక్రయాల్లో వ్యాపారులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో.. ఎక్కడ పడితే అక్కడ జీవాల వధ చేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల స్థానికంగా దోమలు, ఈగలు వృద్ధి చెందడంతోపాటు నీరు కలుషితమై వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధాన, బైపాస్ దారితోపాటు పలు కాలనీల్లో వ్యాపారులు మేకలు, గొర్రెలను ఇష్టారీతిన వధిస్తున్నారు. మినీ శిల్పారామం సమీపంలో నిర్మించిన వధశాల వినియోగంలోకి రాకముందే శిథిలావస్థకు చేరింది. పురపాలిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు 'న్యూస్‌టుడే' ప్రతినిధితో మాట్లాడుతూ వెంటనే మాంసం దుకాణాల సమస్య పరిష్కారానికి కృషి చస్తానని పేర్కొన్నారు.



జోగిపేటలో దారిలో...

రహదారిపైనే వధ...: సదాశివపేటలో బహిరంగ ప్రదేశాల్లో జీవాలను వధించడంతోపాటు విక్రయిస్తున్నారు. పురపాలక కమిషనర్ ఉమ 'న్యూస్‌టుడే' ప్రతినిధితో మాట్లాడుతూ జీవాలను పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖేడ్ పురపాలిక పరిధిలోనూ కబేళా లేదు. వ్యాపారులు ఇళ్లవద్దే జీవాలను కోసి మాంసాన్ని దుకాణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. మూడేళ్ల కిందట సమీకృత మార్కెట్ సమీపంలోని వక్ఫ్‌బోర్డు స్థలాన్ని కబేళాకు కేటాయించినా.. నిధులు మంజూరుకాలేదు. కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామన్నారు.

షెడ్లు నిర్మించి కేటాయింపు మరిచారు

జహీరాబాద్‌లో కాల్వలపైన డబ్బాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని మాంసం అమ్ముతూ పరిస్థితి వేస్తున్నారు. రెండేళ్ల కిందట నిర్మించిన సమీకృత మార్కెట్ భవనంలో మాంసం దుకాణాల కోసం షెడ్లు నిర్మించిన...

నిబంధనలు ఏం చెబుతున్నాయి?

మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? లేదా? పశు సంవర్ధక శాఖకు చెందిన అధికారులు వాటికి ముద్ర వేస్తారు. ఆ తర్వాత వ్యాపారులు ఆ ముద్ర వేసిన మాంసమే విక్రయిస్తున్నారా? లేదా అనేది పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. జీవాలను వధశాలలోనే వధించేలా చూడాల్సిన బాధ్యత కూడా వీరిదే. కాని జిల్లాలో ఎక్కడా ఈ నిబంధనలు అమలు కాకపోవడం గమనార్హం.

వాటిని కేటాయించలేదు. 'న్యూస్‌టుడే' ప్రతినిధితో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే దుకాణాలు కేటాయిస్తామన్నారు. జోగిపేటలో మాంసం దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ లోకల్ 8008573250
ఆందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట

? సంగారెడ్డిలోని ఓడీఎఫ్ కాలనీలో రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం పడినా చిత్తడిగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - శివ కుమార్, సంగారెడ్డి

✓ పరిశీలించి తాత్కాలికంగా మొరం వేయించి సమస్య పరిష్కరిస్తాం. - ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.

? స్థానిక గంజిమైదానంలో రోడ్డుపై చెత్తాచెదారం వేస్తున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి శుభ్రం చేయించాలి. - రాములు, సంగారెడ్డి

✓ వెంటనే చెత్తను తొలగిస్తాం. మరోసారి వేస్తే జరిమానాలు విధిస్తాం. - నైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సంగారెడ్డి

? జోగిపేట పట్టణంలోని చేనేత సహకార సంఘం ముందున్న చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట ఆ ప్రాంత నుంచి వెళుతున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. -నాగభూషణం, జోగిపేట.

✓ వెలగని దీపాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తాం. - తిరుపతి, కమిషనర్ ఆందోలు- జోగిపేట.

? ఆందోలు మండలంలోని నేరడిగుంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఒకప్పటి పాడుబడిన బావి ఉంది. దాని వద్ద పొదలు ఉండటం వల్ల కనిపించడం లేదు. -నర్సింలు, నేరడిగుంట.

✓ ముళ్ల పొదలు తొలగించి అవసరం మేరకు ఆ బావిని పూడ్చివేయడానికి చర్యలు తీసుకుంటాం. -నర్సింహస్వామి గ్రామ కార్యదర్శి నేరడిగుంట.

పార్టీలకు అతీతంగా పథకాలు: సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింప జేస్తున్నట్లు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ర్యాకల్‌కు చెందిన అంజమ్మ, వెంకటాపూర్‌కు చెందిన లక్ష్మీ, పీర్లతండాకు చెందిన హరిసింగ్, కృష్ణాపూర్‌కు చెందిన నారాయణ, వంగ్దాల్‌కు చెందిన వినాయక్‌లకు రూ.40 వేల చొప్పున చెక్కులు అందజేసిన సందర్భంగా మాట్లాడారు.



లబ్ధిదారులకు మహాలక్ష్మీ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్హేర్: నిజాంపేట్ మండలంలోని మునిగేపల్లిలో మహాలక్ష్మీ పథకం కింద మంజూరైన 258 రాయితీ పత్రాలు ఎమ్మెల్యే అందజేశారు. కల్హేర్ ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంపీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగజ్యోతి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎంఈవోల జాబితాలో సీనియర్లకు అన్యాయం: ఎస్టీయూ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: మండల విద్యాధికారుల జాబితాలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు అన్యాయం జరిగిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబెర్‌అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. గతంలో మండల విద్యాధికారిగా పని చేసిన వారిని పరిగణించకుండా సరికాదని పేర్కొన్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు.

'చెత్తదిబ్బపై పోరాటం చేసింది భారాసనే'

గుమ్మడిదల: నల్లవల్లి ప్యారనగర్‌లో చెత్తదిబ్బ(డంపింగ్ యార్డు) వద్దని పోరాటం చేసింది భారాస నేనని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం గుమ్మడిదలలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నల్లవల్లి మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నర్సింహరెడ్డి, హన్మంతరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ పార్లమెంటు కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: మహారాష్ట్ర నాందేడ్ ఎంపీగా గెలుపొందిన చవాన్ బలవంతరావు అకస్మికంగా మృతిచెందగా... త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం నాందేడ్ పార్లమెంటు ఇన్‌ఛార్జిగా నియమించింది. బుధవారం ఆయన అక్కడ కాంగ్రెస్ నాయకులతో సమీక్ష నిర్వహించారు.

నక్షబాట సమస్య పరిష్కారమయ్యేనా?

జిన్నారం: ఊట్ల పంచాయతీ పరిధిలోని నక్షబాట సమస్య పరిష్కారం కావటం లేదు. జులైలో గ్రామస్థుల సమక్షంలో రెవెన్యూ అధికారులు పంచనామా చేసి నిర్ధారించినా... తిరిగి పనులు యథావిధిగానే మారాయి. ఊట్ల రహదారి నుంచి మంగంపేటకు వెళ్లేందుకు 30 అడుగుల బాట వదలాల్సి ఉండగా... ఎవరూ పట్టించుకోవటం లేదని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ మహేశ్‌తోపాలు పలువురు వాపోయారు.

మురుగు పారదు.. చింత తీరదు!

ఈ చిత్రంలో కనిపిస్తున్న మురుగు సమస్య కోహీర్ మండల పరిషత్ కార్యాలయం పక్కనే నెలకొంది. అంతటా పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్యాలయం పక్కనే ఇలాంటి దుస్థితి నెలకొనడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి పాట్లు తప్పడం లేదు. అధికారులు మురుగు సమస్య తీర్చాలని కోరుతున్నారు. 'న్యూస్‌టుడే' ప్రతినిధితో ఎంపీవో వినోద్‌కుమార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారాన్ని వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కోహీర్.



బోరు మోటారుకు మరమ్మతులు కరవు!

సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో తాగునీటి బోరు మోటారు వారం కిందట కాలిపోవడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజల గోడు వినేవారు కరవయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. 'న్యూస్‌టుడే' ప్రతినిధితో కార్యదర్శి భిక్షపతి మాట్లాడుతూ త్వరలో మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు.



– న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

రోడ్డును తవ్వి.. వదిలేశారు!

సంగారెడ్డి పట్టణంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాజంపేట నుంచి మల్కాపూర్‌కు వెళ్లే రోడ్డుపై కాల్వలు తవ్వి నీటిని చెరువుల్లోకి మళ్లించారు. వర్షాలు తగ్గిన తరువాత ఆ కాల్వలను పురపాలక అధికారులు పూడ్చివేయడం మరిచారు. వీటివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోతుంది. రాత్రుళ్లు కాల్వలు గమనించకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



– న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

గుమ్మడిదల, జిన్నారం, కోహీర్, వట్‌పల్లి, కల్హేర్: గుమ్మడిదల ఎంఈవోగా ధాస్యం రాంబాబు బుధవారం ఎమ్మార్సీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించారు.

● జిన్నారం ఎంఈవోగా చెట్లపోతారం జడ్పీ హెచ్‌ఎం కుమారస్వామి నియామకం కావడంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

● కోహీర్ ఎంఈవోగా జాకీర్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శంకర్‌నాయక్ ఇటీవల సదాశివపేటకు బదిలీపై వెళ్లారు. ● నిజాంపేట్ ఎంఈవోగా రాములును నియమితులయ్యారు.

వట్‌పల్లి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రామలింగం

వట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్తు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రామలింగం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీవో శశిప్రభ అనారోగ్యానికి గురవడంతో సెలవులో ఉన్నారని తెలిపారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

శిక్షణ ఐఏఎస్ అధికారి మనోజ్



శిక్షణ ఐఏఎస్ అధికారి మనోజ్ తదితరులు

కొండాపూర్: శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం అభినందనీయమని శిక్షణ ఐఏఎస్ అధికారి మనోజ్ పేర్కొన్నారు. బుధవారం తొగర్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజలు వైద్య ఉచిత శిబిరాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మండల వైద్యురాలు రమమణి, కార్యదర్శి నర్సమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

శుభ్రత... ప్రతిఒక్కరి బాధ్యత

నారాయణఖేడ్: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ఖేడ్ పురపాలిక కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం అంగన్వాడీల టీచర్లు, సహాయకులు, స్వయం సహాయక బృందాల మహిళలు, ఆర్పీలు, మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న ఖేడ్ పురపాలిక కమిషనర్ జగ్జీవన్

ఐడీఏ బొల్లారం(జిన్నారం), న్యాల్‌కల్: ఐడీఏ బొల్లారం పురపాలిక పరిధిలో బుధవారం స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో తడి, పొడి, విషపూరిత చెత్త గురించి అవగాహన కల్పించారు. ● న్యాల్‌కల్ మండలంలోని చేనిగేపల్లి, ఇబ్రాహీంపూర్ గ్రామాల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో రాజశేఖర్ పేర్కొన్నారు. తదుపరి ఇబ్రాహీంపూర్‌లో ఓటరు జబితా పరిశీలించారు.

సేవలే గుర్తుండిపోతాయి

మనూరు, న్యూస్‌టుడే: చేసినసేవలే చిరకాలంగా గుర్తుండిపోతాయని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన మనూరు ఏవో శ్రీనివాస్‌రెడ్డి, కొత్తగా ఏవోగా వచ్చిన మహేష్‌చౌహన్‌లకు బుధవారం మనూరు రైతు వేదికలో ఎరువుల దుకాణాల డీలర్లు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఏఈవోలు సంగమేశ్, మహేష్ కుమార్, ప్రవీణ్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రెడ్డి సన్మానిస్తున్న నూతన్‌కుమార్

జహీరాబాద్(ఝరాసంగం) : ఇటీవల బదిలీపై వెళ్లిన ఝరాసంగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దామోదర్, జీర్లపల్లి హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌లకు బుధవారం ఝరాసంగంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్‌కుమార్ సూచించారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఇస్టా జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలు.. అడ్డుకట్టపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. చదువుపై దృష్టి సారించాలని, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పట్టణ సీఐ భాస్కర్, ఎస్ఐ రాము నాయక్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

జోగిపేట: అందోలు చెరువు టన్నెల్‌కు ఇటీవల పడిన గండి పూడ్చివేత పనులను బుధవారం నీటి పారుదల శాఖ ఈఈ బి.భీమ్ పరిశీలించారు. నీటి లీకేజీ లేకుండా పనులు చేస్తుండటంతో సిబ్బందిని అభినందించారు. ఏఈ మజర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఉన్నారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

కంది: మండల పరిధి ఎద్దుమైలారం, జుల్కల్ పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరకులను డీఎల్పీవో అనిత బుధవారం పంపిణీ చేశారు. కార్మికుల ఆరోగ్య స్థితిగతులు చూసుకోవాల్సిన బాధ్యత కార్యదర్శులదేనని చెప్పారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇష్టారీతిన సీసీ రోడ్ల నిర్మాణం!

ఐడీఏ బొల్లారం(జిన్నారం), న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం ఇష్టారీతిన నిర్వహిస్తున్నారని కాలనీ నాయకుడు విఠల్‌చారీ ఆరోపించారు. రోడ్లు తవ్వి వేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవటం లేదని అన్నారు. అధికారులు విచారణ చేసి గుత్తేదారుకు బిల్లులు నిలుపుదల చేయాలని కోరారు.

శిక్షణతో మహిళల ఉపయోగం

సదాశివపేట, కొండాపూర్: తెలంగాణ స్కిల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సదాశివ పేట పట్టణంలో మహిళలకు కుట్టుమిషన్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువ పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శిక్షకురాలు పద్మ, సంస్థ ప్రతినిధులు సల్మాన్, ప్రవీణ, శైలజ, మున్సిపల్ కౌన్సిలర్ మహేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు పొందిన మహిళలతో ఛైర్‌పర్సన్ అపర్ణపాటిల్, సంస్థ ప్రతినిధులు

ఝరాసంగంలో సామాజిక తనిఖీ

జహీరాబాద్(ఝరాసంగం): ఝరాసంగంలో బుధవారం గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023-24వ సంవత్సరానికి సంబంధించిన రూ.8 కోట్ల పైచిలుకు నిధులతో చేపట్టిన పనులు తనిఖీ నిర్వహించారు. అదనపు డీఆర్‌డీఓ బాలరాజు, సెక్టార్ కోఆర్డినేటర్ శ్రీలత, ఎంపీడీవో సుధాకర్, ఏపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో క్రీడాసామగ్రి అందజేత

నారాయణఖేడ్: ఖేడ్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థులైన దాతల సహకారంతో బుధవారం క్రీడాసామగ్రిని ఉపాధ్యాయులు డా.రాజయ్య, చంద్రశేఖర్ అందజేశారు.

'ఎండోమెంట్ వ్యవస్థను రద్దు చేయండి'

మనూరు, న్యూస్‌టుడే: ఎండోమెంట్ వ్యవస్థను రద్దుచేసి, హిందూ దేవాలయాలను పరిరక్షించాలని దేవలయాల పరిరక్షణ సమితి సభ్యులు సాయిరాం పేర్కొన్నారు. బుధవారం మనూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ మగ్నికు వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

సదాశివపేట: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు కోరారు. బుధవారం ఆత్మకూర్‌లో మాట్లాడుతూ షరతుల్లేకుండా రుణమాఫీ చేస్తామని ప్రకటించి.... తీరా అధికారంలోకి వచ్చిన తరువాత నిబంధలు పెట్టారని ఆరోపించారు.

1,649 దరఖాస్తులకు సవరణ

కోహీర్, న్యూస్‌టుడే: కోహీర్ మండలంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో గృహజ్యోతి, రూ.500లకు గ్యాస్ సంబంధించిన 1,649 దరఖాస్తులు సవరించామని ఎంపీవో వినోద్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు.

ఖేడ్‌లో త్వరలో రవాణాశాఖ సేవలు

నారాయణఖేడ్: ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి కృషితో త్వరలో రవాణా శాఖ సేవలు ప్రారంభం కానున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్‌అలీ, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, బంజారాసేవాలాల్‌సంఘ రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌చౌహాన్ బుధవారం స్థానికంగా మాట్లాడారు.

కార్మికులందరికీ బోనస్ ఇవ్వండి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మల్లేష్ పేర్కొన్నారు. ఈ మేరకు రూపొందించిన కరపత్రాలు బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బిలాల్‌పూర్‌లో 'పోషణ మాసం'

కోహీర్, న్యూస్‌టుడే: బిలాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం-4లో ఐసీడీయస్ ఆధ్వర్యంలో బుధవారం 'పోషణ మాసం' నిర్వహించారు. పర్యవేక్షకురాలు తులసమ్మ.. బాలింతలు, గర్భిణులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం ప్రవీణ, టీచర్లు బాలమణి, శ్రీలత, నాగమణి, అంజమ్మ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: మంచి పోషకాహారంతోనే కంటిచూపు మెరుగు పడుతుందని, అందుకోసం పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని కంటి వైద్యురాలు శోభారాణి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి రెడ్డిపల్లిలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ ట్రైబల్ సొసైటీ ఏకల్ అభియాన్ మహిళా సమితి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, సరోజనిదేవి కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు.

జిన్నారంలో బాలమేళా

జిన్నారం: జిన్నారంలో బుధవారం నిర్వహించిన 'బాలమేళా'లో చిన్నారులతో వివిధ కృత్యాలు చేయించారు. పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వారితోపాటు సీడీపీవో జైరామ్‌నాయక్, ఎంపీడీవో అరుణారెడ్డి, పర్యవేక్షకురాలు ప్రతిభ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆందోళన!

కోహీర్, న్యూస్‌టుడే: తమ భూమిని తహసీల్దార్ అక్రమంగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ కోహీర్ మండలం గొట్టిగార్‌పల్లికి చెందిన రైతులు మొల్లప్ప, యెంకప్ప, మొగులప్ప బుధవారం ఆందోళనకు దిగారు. ఇకపై ఈ సర్వే సంఖ్యలోని భూమిని ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయరాదని ఆ రైతులు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ ఘటనపై కోహీర్ తహసీల్దార్ బాలశంకర్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. కోర్టు తీర్పుతోపాటు ఆర్డీవో, కలెక్టర్ ధ్రువీకరణ తర్వాతే రిజిస్ట్రేషన్ పూర్తయిందని పేర్కొన్నారు.



కోహీర్ తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బాధిత రైతులు

లీకేజీ అరికట్టి.. ట్యాంకును శుభ్రం చేసి..

ఈనాడు కథనానికి స్పందన

నారాయణఖేడ్ పురపాలిక 8వ వార్డులోని మన్సూర్‌పూర్ ట్యాంకు నుంచి కొద్దిరోజులుగా నీటి లీకేజీని అధికారులు గుర్తించి అరికట్టారు. ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన నాచును తొలగించారు. ఆదివారం 'ఇలాగైతే రోగాలు రావా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి పురపాలిక నీటిసరఫరా విభాగం పర్యవేక్షకులు శ్రావణ్‌కుమార్ స్పందించారు. కార్మికులతో ట్యాంకు చుట్టూ చెత్త, మురుగును శుభ్రం చేయించారు. ట్యాంకులో క్లోరినేషన్ చేయించి ప్రజలు స్వచ్ఛమైన నీరు పొందేలా చర్యలు తీసుకున్నారు.

– న్యూస్‌టుడే, నారాయణఖేడ్.